RNI NO :Title-Code :-TELTEL02102

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దినపత్రిక

అనుక్షణం ప్రజలపక్షం...

సంపుటి - 1 సంచిక - 164 శనివారం 9 మార్చి 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పనిచేయుటకు
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా, మండల, కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను.
ఎడిటర్ : బిర్రు కరుణాకర్
Cell: 9701249103

## త్వరలో కేంద్రానికి జమిలి ఎన్నికలపై నివేదిక



4లో.

# ఎంఐఎంతో కలిసి అభివృద్ధి చేస్తాం

- పాతబస్తీలో మెట్రో రైలు మార్గానికి శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్ రెడ్డి
- రూ.2 వేల కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న మెట్రోకు ఫరూక్ నగర్ బస్ డిపో వద్ద శంకుస్థాపన
- తమ ప్రభుత్వం వరుసగా అభివృద్ధి పనులతో ముందుకు సాగుతోందన్న ముఖ్యమంత్రి
- ఎన్నికల సమయంలోనే రాజకీయాలు... మిగతా సమయాల్లో అభివృద్ధికే ప్రాధాన్యత ఉంటుందని హామీ

2లో.



## రాజ్య సభకు సుధామూర్తి



- నామినేట్ చేసిన రాష్ట్రపతి..
- సుధామూర్తిని నామినేట్ చేసిన విషయాన్ని ప్రకటించిన మోదీ
- విద్య, సామాజిక సేవలో ఆమె కృషి వెలకట్టలేనిదని ప్రశంస
- రాజ్యసభకు నామినేట్ కావడం నారీ శక్తికి నిదర్శనమని వ్యాఖ్య

2లో.

## త్వరలో మహిళలకు వడ్డీలేని రుణాలు

: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



- పానగల్ చారిత్రాత్మక పచ్చల ఛాయా సోమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి కోమటిరెడ్డి
- మహిళల ఆర్థిక అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందని వెల్లడి

## సమ్మక్క సారక్క గిరిజన వర్సిటీ ప్రారంభం

- ములుగులో తాత్కాలిక భవనాలు..
- వర్సిటీ కోసం రూ 900 కేటాయింపు
- ఈ విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్లు
- త్వరలో మోదీ చేతుల మీదుగా భూమి పూజ
- వెల్లడించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**మార్చి8 (జర్నలిస్ట్ వార్త):** ములుగులో ఏర్పాటు చేసిన సమ్మక్క సారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం తాత్కాలిక భవనాన్ని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి నేడు లాంచనంగా ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరం నుంచే ఈ విశ్వవిద్యాలంలో తరగతులు ప్రారంభిస్తామన్నారు. .సమ్మక్క సారక్క యూనివర్సిటికి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నోడల్ గా ఉంటుందన్నారు.. మహిళ దినోత్సవ సందర్భంగా సమ్మక్క సారలమ్మ జాతీయ గిరిజన వర్సిటీ ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందన్నారు..పూర్తి స్థాయిలో భూమిని రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తే యూనివర్సిటీ శాశ్వత భవన నిర్మాణం చేపడుతామన్నారు.. దీనికి ఎటువంటి నిధుల కొరత లేదన్నారు కిషన్ రెడ్డి . ఈ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు రూ.900 కోట్లు కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు.. ఎన్నికల అనంతరం శాశ్వత భవన నిర్మాణలకు ప్రధాని మోదీ తో భూమి పూజ చేయిస్తామని చెప్పారు..తెలంగాణలో 9.8 గిరిజన జనాభా శాతం ఉందని, అలాగే వారిలో 50 శాతం మంది నిరక్షరాస్యులని వివరించారు.. ట్రైబల్స్ లో అక్షర్యాసత్యను పెంచాల్సిన అవసరం ఉందని అన్నారు.

## జీఓ నం.3 రద్దు చేయాలి

### బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత డిమాండ్



**మార్చి8 (జర్నలిస్ట్ వార్త):** భారత జాగృతి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత హైదరాబాదులోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద దీక్షకు దిగారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు జీఓ నం.3 శరాఘాతంగా నిలుస్తోందని కవిత ఆరోపించారు. ఈ జీఓను వెంటనే రద్దు చేయాలని ఆమె డిమాండ్ చేస్తూ దీక్ష చేస్తున్నారు. ఈ జీఓ ద్వారా మహిళలకు ఉద్యోగ నియామకాల్లో అన్యాయం జరుగుతోందని ఆమె అన్నారు. మహిళలకు న్యాయం జరిగే జీఓ నం.41ను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే వ్యక్తిగత కారణాలతో చనిపోయిన అమ్మాయిని కూడా కాంగ్రెస్ రాజకీయంగా వాడుకుందని ఆమె విమర్శించారు.

# కాంగ్రెస్ తొలి జాబితా

## తెలంగాణలో నలుగురు అభ్యర్థుల పేర్లు ప్రకటన

- జహీరాబాద్ నుంచి సురేష్ షెట్కార్, చేవెళ్ల నుంచి సునీతా మహేందర్ రెడ్డి...
- నల్గొండ నుంచి కుందూరు రఘువీర్ రెడ్డి, మహబూబాబాద్ నుంచి బలరాం నాయక్ పేర్లు ఖరారు
- వయనాడ్ నుంచి రాహుల్ గాంధీ పోటీ









**మార్చి8 (జర్నలిస్ట్ వార్త):** రానున్న లోక్ సభ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ 36 మంది అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేసింది. తెలంగాణలో 17 లోక్ సభ స్థానాలకు గాను నలుగురి పేర్లను ప్రకటించింది. జహీరాబాద్ నుంచి సురేష్ షెట్కార్, చేవెళ్ల నుంచి సునీతా మహేందర్ రెడ్డి, నల్గొండ నుంచి కుందూరు రఘువీర్ రెడ్డి (జానారెడ్డి తనయుడు), మహబూబాబాద్ నుంచి బలరాం నాయక్ పేర్లను ఖరారు చేసింది.

ఛత్తీస్‌గఢ్ నుంచి 6, కర్ణాటక నుంచి 6, కేరళ నుంచి 15, మేఘాలయ నుంచి రెండు, నాగాలాండ్ నుంచి ఒకటి, సిక్కిం నుంచి ఒకటి, తెలంగాణ నుంచి నాలుగు, త్రిపుర నుంచి ఒక స్థానంలో అభ్యర్థులను ప్రకటించింది. కేరళలోని వయనాడ్ నుంచి మరోసారి రాహుల్ గాంధీ బరిలోకి దిగుతున్నారు. కర్ణాటకలోని శివమొగ్గ నుంచి గీతా శివరాజ్ కుమార్‌కు టిక్కెట్ ఇచ్చింది. గురువారం ఏఐసీసీ కార్యాలయంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు సోనియా గాంధీ, కేసీ వేణుగోపాల్ నేతృత్వంలో పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశమైంది. తెలంగాణ నుంచి సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, తెలంగాణ ఇంఛార్జ్ దీపాదాస్ మున్షీ తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి అయిదేళ్లు ప్రశాంతంగా పని చేసుకుంటూ వెళ్లవచ్చు... మేం అండగా ఉంటాం

: అసదుద్దీన్ ఒవైసీ

- పట్టుదల కలిగిన నేత... అందుకే ఈ స్థాయికి వచ్చారని కితాబు
- అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహిస్తామని వెల్లడి
- పాతబస్తీ అభివృద్ధికి రూ.120 కోట్లు మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలిపిన అసదుద్దీన్



2లో.

# రాజ్య సభకు సుధామూర్తి

**మార్చి8 (జర్నలిస్ట్ వార్త):**
ప్రముఖ విద్యావేత్త, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి భార్య సుధామూర్తిని రాష్ట్రపతి రాజ్యసభకు నామినేట్ చేశారు. ఈ విషయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు.
ఎక్స్ వేదికగా ప్రధాని స్పందిస్తూ భారత రాష్ట్రపతి సుధామూర్తిని రాజ్యసభకు నామినేట్ చేశారనే విషయాన్ని తెలిపేందుకు సంతోషిస్తున్నానని చెప్పారు. విద్య, సామాజిక సేవ, దాతృత్వం ఇలా ఎన్నో రంగాల్లో ఆమె చేసిన కృషి వెలకట్టలేనిదని, స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఆమె రాజ్యసభకు నామినేట్ అవడం నారీశక్తికి, దేశ నిర్మాణంలో మన మహిళల శక్తి సామర్థ్యాలను చాటి చెప్పడానికి చక్కటి ఉదాహరణ అని చెప్పారు. సుధామూర్తి పార్లమెంటరీ పదవీకాలం ఫలప్రదం కావాలని ఆకాంక్షించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున ఈ ప్రకటన వెలువడటం గమనార్హం సుధామూర్తి చేసిన సేవలకు గాను కేంద్ర ప్రభుత్వం ఆమెను 2006లో పద్మశ్రీ, 2023లో పద్మభూషణ్ పురస్కారాలతో సత్కరించింది. 73 ఏళ్ల సుధామూర్తి ప్రస్తుతం 'మూర్తి ట్రస్ట్'కు ఛైర్ పర్సన్ గా వ్యవహరిస్తున్నారు. సుధామూర్తి తన కెరీర్ ను టెల్కో (ప్రస్తుతం టాటా మోటార్స్) సంస్థలో ఇంజినీర్ గా ప్రారంభించారు.

# త్వరలో మహిళలకు వడ్డీలేని రుణాలు

**మార్చి8 (జర్నలిస్ట్ వార్త):**
త్వరలో మహిళలకు వడ్డీలేని రుణాలు అందిస్తామని తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన నల్గొండ పట్టణంలోని పానగల్ చారిత్రాత్మక పచ్చల ఛాయా సోమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందరికీ శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... ఇక్కడ ఉన్న ఆలయాలకు ఎంతో ప్రత్యేకత ఉందని తెలిపారు. ఆలయాల అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తామన్నారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మహిళల ఆర్థిక అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. మహిళా సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. త్వరలో వడ్డీ లేని రుణాలు అందిస్తామన్నారు.

# ఎంఐఎంతో కలిసి హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తాం

**మార్చి8 (జర్నలిస్ట్ వార్త):**
హైదరాబాద్: ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలని, మిగతా సమయాల్లో అభివృద్ధికే ప్రాధాన్యమిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5 కి.మీ మేర మెట్రో ప్రాజెక్టు విస్తరణకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు.
హైదరాబాద్ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని.. ఈ విషయంలో ఎంఐఎంతో కలిసి పనిచేస్తామని తెలిపారు."హైదరాబాద్ అభివృద్ధికి 2050 వైబ్రంట్ మాస్టర్ ప్లాన్ తయారు చేస్తున్నాం. పాతబస్తీలో రోడ్ల విస్తరణకు రూ.200 కోట్లు కేటాయించాం. మూసీ నదిని 55 కి.మీ మేర సుందరీకరిస్తాం. మూసీ రివర్ ఫ్రంట్ ఏర్పాటు చేసి చూపిస్తాం. మెట్రో రైలు బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌కే కాదు పాతబస్తీకి ఉండాలి. అందులో సంపన్నులే కాదు మధ్యతరగతి ప్రజలూ ప్రయాణించాలి. చాంద్రాయణగుట్ట క్రాస్ రోడ్ మెట్రోలో అతిపెద్ద జంక్షన్ కాబోతోంది. చంచల్‌గూడ జైలును అక్కడి నుంచి తరలించి.. విద్యాసంస్థ ఏర్పాటు చేస్తాం. రాజకీయాలు వేరు అభివృద్ధి వేరు. 2034 వరకు కాంగ్రెస్ అధికారంలో ఉంటుంది. వచ్చే నాలుగేళ్లలో పాతబస్తీ మెట్రో రైలు పూర్తి చేసి ప్రయాణిస్తాం.

### రేవంత్‌రెడ్డి పట్టుదలతో ఈ స్థాయికి వచ్చారు: ఎంపీ అసదుద్దీన్

ఎంపీ అసదుద్దీన్ మాట్లాడుతూ... "హైదరాబాద్‌కు గుండెలాంటి పాతబస్తీకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం. ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తారని ఆశిస్తున్నాం. మీ చేతుల్లో ఐదేళ్లు అధికారం ఉంటుంది. అభివృద్ధికి మేం సహకరిస్తాం. రేవంత్‌రెడ్డి చాలా పట్టుదలతో ఈ స్థాయికి వచ్చారు. తెలంగాణలో ప్రజలు కలిసిమెలిసి జీవిస్తున్నారు. కొన్ని శక్తులు విధ్వంసానికి కుట్రలు పన్నుతున్నాయి.. వాటిని అడ్డుకోవాలి. రాష్ట్రాన్ని శాంతియుతంగా ముందుకు తీసుకెళ్లాలి. పాతబస్తీలో అభివృద్ధి పనుల కోసం సీఎంను కలవగానే రూ.120 కోట్లు విడుదల చేశారు. మూసీ నది అభివృద్ధికి మా పార్టీ సహకరిస్తుంది" అని పేర్కొన్నారు. అంతకుముందు సభలో కాంగ్రెస్, ఎంఐఎంకు మద్దతుగా మహిళలు పోటా పోటీ నినాదాలు చేశారు.

# నేను పార్టీ మారడం లేదు : మల్లారెడ్డి క్లారిటీ



**మార్చి8 (జర్నలిస్ట్ వార్త):**
హైదరాబాద్: పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న ప్రచారంపై మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి స్పందించారు. తాను పార్టీ మారడం లేదని కార్లిటీ ఇచ్చారు.
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మల్లారెడ్డి శుక్రవారం కలిశారు. మల్లారెడ్డితో పాటు ఆయన కుమారుడు భద్రారెడ్డి కూడా ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో తాము పోటీ చేయడం లేదని తెలిపారు.మల్కాజ్‌గిరిలో బీఆర్ఎస్ ఎవరికి టికెట్. ఇచ్చిన గెలిపించుకుంటామని పేర్కొన్నారు. గురువారం సీఎం రేవంత్ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని కలవడంపై మల్లారెడ్డి వివరణ ఇచ్చారు. తన అల్లుడు రాజశేఖర్ రెడ్డికి చెందిన కాలేజీ భవనాల కూల్చివేత అంశంపై కలిసినట్లు పేర్కొన్నారు. ఇదే విషయం కేసీఆర్‌ను కలిసి కూడా చెప్పినట్లు తెలిపారు. తనకు పార్టీ మారరే ఉద్దేశ్యం లేదని చెప్పారు. సోషల్ మీడియా తమకు నచ్చినట్లు రాసుకుంటుందని, దానిని తాను పట్టించుకోనని అన్నారు.కాగా గత నెలలో మల్లారెడ్డి మీడియాతో మాట్లాడుతూ మల్కాజ్‌గిరి ఎంపీ స్థానానికి తన కుమారుడు భద్రారెడ్డి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపిన సంగతి తెలిసిందే. అయితే నేడు లోక్‌సభ ఎన్నికల్లో తాను పోటీ చేయడం లేదని భద్రారెడ్డి కేటీఆర్‌కు తెలిపినట్లు సమాచారం.

# 11న ఛలో హైదరాబాద్ పిలుపు

## టెట్ వేసి టీచర్ పోస్టులు పెంచాలని
## జాతీయ బి.సి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య



**మార్చి8 (జర్నలిస్ట్ వార్త):**
హైదరాబాద్ : డిఎస్‌సితో పాటు టెట్ పరీక్షలను నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11న ఛలో హైదరాబాద్ ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని రాజ్యసభ సభ్యులు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య పిలుపు నిచ్చారు. ఆ రోజు హైదరాబాదులోని ఇందిరాపార్క్ వద్ద భారీ ఎత్తున ధర్నా జరపనున్నట్లు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నిరుద్యోగ జాక్ చైర్మన్ నీలం వెంకటేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ డిఎస్‌సితో పాటు టెట్ నిర్వహించడం సాంప్రదాయం అని, గతంలో మన రాష్ట్రం ప్రతిసారీ డిఎస్‌సితో పాటు టెట్ నిర్వహించారన్నారు.
పక్క రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్ ,కర్ణాటక, ఛత్తీస్‌ఘడ్‌లలోనూ డిఎస్‌సితో పాటు టెట్ వేశారన్నారు. టెట్ పాస్ కాకుండా టీచర్ పోస్టు రాయడానికి అర్హత రాదని, టెట్ వేయడానికీ ప్రభుత్వానికి అభ్యంతరాలు ఏమీ లేవన్నారు.
ఈ సందర్భంగా నిరుద్యోగులను ఉద్దేశించి ఆర్ కృష్ణయ్య ప్రసంగిస్తూ టెట్ , డిఎస్‌సి నోటిఫికేషన్ ఒకేసారి వేయడానికి ప్రభుత్వానికి అభ్యంతరాలు ఏమిటి అని ప్రశ్నించారు. టెట్ పాస్ కాకపోతే డిఎస్‌సికి అర్హత లేని విషయం తెలిసి కూడా పాలుకులు ఈ విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. టెట్ నిర్వహించి ఆరు నెలలు గడిచిందని, గత టెట్ పరీక్షలో కేవలం 10 శాతం మంది మాత్రమే పాసయి..మరో 90 శాతం మంది ఫెయిలయ్యారన్నారు. బిఎడ్, డిఎడ్ పాసైన వారు 7 లక్షల మంది ఉన్నారన్నారు. కానీ వారిలో టెట్ పాస్ అయిన వారు కేవలం 3 లక్షల మంది మాత్రమే ఉన్నారన్నారు. అటు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు చాలా తక్కువగా ఉన్నాయని, బిఎడ్ చేసిన వాళ్ళు 4లక్షలకు పైగా ఉన్నారన్నారు. కానీ పోస్టులు చాలా తక్కువగా 2200 మాత్రమే స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నాయన్నారు. 75 శాతం ప్రమోషన్ల ద్వారా ఇవ్వరాదని దీనిని 25 శాతంకు తగ్గించి మిగతా పోస్టులను డైరెక్ట్ రిక్రూట్ మెంట్ కోటా కింద భర్తీ చేయాలని ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఎందుకంటే బిఎడ్ వారికి ఎస్‌జిటి పోస్టులకు అర్హత లేకుండా చేశారన్నారు. బిఎడ్ వారికి మిగిలినవి స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు తప్ప మిగతా పోస్టులకు అర్హత లేదని, బిఎడ్ చేసిన వారికి చాలా అన్యాయం జరుగుతుందన్నారు.ప్రస్తుతం 11 వేల టీచర్ పోస్టుల భర్తీకే డిఎస్‌సి ప్రకటించారని, కానీ 24వేలకు పైగా టీచరు పోస్టులు ఉన్నాయన్నారు. టీచర్ పోస్టులు సంఖ్య కూడా తక్కువగా వేశారని ఆ సంఖ్య విషయంలో అధికారులు ఆధారపడకుండా నిరుద్యోగుల సంఘాలు, ఉద్యోగ సంఘాలతో సమావేశం జరిపి చర్చలు జరపాలని కోరారు. ఈ క్రింది అంశాలను పరిగణలోకి తీసుకొని ఖాళీలు నిర్ణయించాలని విజ్ఞప్తి చేస్తారు. 11 వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటించడం కాదు.. డిఎస్‌సి టీచర్ పోస్టులు 24వేలకు పెంచి భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలలో 25వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పిఆర్‌సి కమిటీ రిపోర్టులో పేర్కొందని, 24 వేలకు పైగా టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నవని ఉపాధ్యాయ సంఘాలు తెలుపుతున్నాయన్నారు. అలాగే 10వేలమంది సెకండరీ గ్రేడ్ టీచర్ల స్కూల్ టీచర్లకు అసిస్టెంట్ ప్రమోషన్లు ఇస్తే ఇంకో 10వేల పోస్టులు వస్తాయన్నారు. గత 10 సంవత్సరాల కాలం నుంచి దాదాపు 6వేలకు పైగా పాఠశాలలు మూసివేశారని, వీటిలోని టీచర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఇప్పుడు కూడా 22 వేల స్పెషల్ టీచర్లు నియమించడానికి
5 నెలల క్రితం ఆర్థిక శాఖ ఆమోదించిందని, టీచర్ పోస్టులు ఖాళీగా లేకపోతే ఈ స్పెషల్ టీచర్లు ఎందుకు నియమిస్తారో తెలపాలన్నారు. టీచర్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో 16 వేల పాఠశాలలో ఇంగ్లీష్, మథ్స్, సైన్స్ పాఠాలు చెప్పేవారు లేరని, విద్యార్థులుకు ఈ సబ్జెక్టులో విషయ పరిజ్ఞానం లేక చదువులల్లో వెనుకబడి పోతున్నారన్నారు. ఇప్పటికైనా టీచర్ పోస్టులు ఖాళీల విషయంలో విద్యాశాఖ అధికారులు సరిగ్గా లెక్కించాలని కోరారు.

# ఆకాశంలో సగం కాదు.. 'ఆమే' ఆకాశం: కేటీఆర్

**అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కేటీఆర్ శుభాకాంక్షలు**
**మహిళా సంక్షేమంలో యావత్ దేశానికే బీఆర్ఎస్ పాలన ఆదర్శమని వ్యాఖ్య**
**మహిళలకు కేసీఆర్ కొండంత అండగా నిలిచారన్న కేటీఆర్**



**మార్చి8 (జర్నలిస్ట్ వార్త):**
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ... బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళలకు ఏమేం చేసిందో వివరించారు.మహిళా సంక్షేమంలో గత పదేళ్ల బీఆర్ఎస్ పాలన యావత్ భారత దేశానికే ఆదర్శమని కేటీఆర్ అన్నారు. అప్పుడే పుట్టిన ఆడబిడ్డ నుంచి ఆరు పదులు దాటిన అవ్వ వరకు అందరినీ బీఆర్ఎస్ ప్రభుత్వం కాపాడిందని చెప్పారు. గర్భిణీలకిచ్చిన న్యూట్రిషన్ కిట్లు ఆరోగ్య తెలంగాణ నిర్మాణానికి తొలి మెట్లు అని అన్నారు. ఆడబిడ్డ పుట్టిందంటే.. ఇంట్లో లక్ష్మీదేవి అడుగుపెట్టినట్టేనని చెప్పారు. కేసీఆర్ కిట్ లో పాటు అందిన 13 వేలు.. ప్రతి పుట్టిల్లు ఎప్పటికీ మరువలేని మేలు అని అన్నారు. లక్ష్మీ కటాక్షమే కాదు... తెలంగాణ ఆడబిడ్డలకు సరస్వతి కటాక్షం అందించిన ఘనత మనకే సొంతమని కేటీఆర్ చెప్పారు. కార్పొరేట్ కు దీటైన గురుకులాలతో పేద మధ్య తరగతి తల్లిదండ్రుల కలలు సాకారమయ్యాయని తెలిపారు. ఆడబిడ్డలకు రక్షణ కవచంగా నిలిచిన "షీటీమ్స్" ఒక సంచలనమని చెప్పారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు నవ శకం అని అన్నారు. కల్యాణలక్ష్మి కేవలం పథకమే కాదని, ఒక గొప్ప సంప్రదాయమని చెప్పారు.
"గుక్కెడు మంచినీళ్ల కోసం మైళ్ల దూరం నడిచిన మహిళల కష్టాలను భగీరథతో శాశ్వతంగా తీర్చాం. అమ్మఒడి వాహనాలపై సర్వత్ర హర్షం వ్యక్తమవుతోంది. మహిళా సంక్షేమంలో నాటి పాలనకు ఎదురు లేదని చెప్పారు. భర్తను కోల్పోయిన అక్కాచెల్లెళ్లకు అన్నలా.. ఒంటరి మహిళలకు తండ్రిలా... ఆడబిడ్డలకు మేనమామలా.. అవ్వలకు పెద్దకొడుకులా... కొండంత అండగా నిలిచిన ఏకైక పాలకుడు.. మన కేసీఅర్ గారు" అని అన్నారు.
పదేళ్ల పాలనలో సముద్రమంత సంక్షేమాన్ని అందించి, ఆడబిడ్డల సమగ్ర అభివృద్ధికి బంగారు బాటలు వేసిన బీఆర్ఎస్ తరపున యావత్ నారీ శక్తికి హృదయపూర్వకంగా మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతున్నానని కేటీఆర్ ట్వీట్ చేశారు.

# రేవంత్ రెడ్డి అయిదేళ్లు ప్రశాంతంగా పని చేసుకుంటూ వెళ్లవచ్చు...

## మేం అండగా ఉంటాం: అసదుద్దీన్ ఒవైసీ



**మార్చి8 (జర్నలిస్ట్ వార్త):**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అయిదేళ్లు ప్రశాంతంగా పని చేసుకుంటూ వెళ్లవచ్చునని... తాము అండగా ఉంటామని మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ పార్లమెంట్ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. ముఖ్యమంత్రిపై అసదుద్దీన్ ప్రశంసలు కూడా కురిపించారు. రేవంత్ రెడ్డి చాలా పట్టుదల కలిగిన నేత అని... అందుకే ఈ స్థాయికి వచ్చారని పేర్కొన్నారు. పాత బస్తీ మెట్రో రైలు మార్గానికి సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో అసదుద్దీన్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు ఇచ్చిన తీర్పును తాము శిరసావహిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో రేవంత్ రెడ్డికి తాము అండగా ఉంటామన్నారు.తెలంగాణ ప్రజలు కలిసిమెలిసి జీవిస్తున్నారని, కానీ కొన్ని శక్తులు విధ్వంసానికి కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. అలాంటి శక్తులను అడ్డుకోవాల్సి ఉందన్నారు. ముఖ్యమంత్రిని కలవగానే పాతబస్తీ అభివృద్ధికి రూ.120 కోట్లు విడుదల చేశారని చెబుతూ... ఈ నిధులు మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఉస్మానియా ఆసుపత్రికి కొత్త భవంతిని నిర్మించాలని కోరారు. కాంగ్రెస్ చేపట్టిన మూసీ అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. చంచల్ గూడ జైలును హైదరాబాద్ వెలుపలకు తరలించి... ఆ స్థానంలో కేజీ టు పీజీ క్యాంపస్ నిర్మించాలని సూచించారు.

## కెటిఆర్‌కు ఐఐటి మద్రాస్ ఆహ్వానం

**మార్చి8 (జర్నలిస్ట్ వార్త):**
/హైదరాబాద్ : భారత రాష్ట్ర సమి తి వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు మరో ప్రముఖ ఆహ్వానం అం దింది. దేశంలోనే అత్యుత్తమ ఇంజనీరింగ్ విద్యాసంస్థల్లో మొదటి వరుస లో నిలిచే ఐఐటి మద్రాస్ శని, ఆదివారాలలో జరిగే అంట్రపెన్యూరల్ సమ్మిట్లో ప్రసంగించాల్సిందిగా కెటిఆర్‌ను ఆహ్వానించింది. ప్రతిఏటా ఐఐటి మ ద్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించే అంట్రపెన్యూరల్ ఫెస్టివల్ సమ్మిట్‌లో కీలకోపన్యాసం చేయాలని కోరింది. ఐఐటి మద్రాస్‌లో ప్రతి ఏటా నిర్వహించే ఈ- సమ్మిట్‌కు దేశ విదేశాల నుంచి అంట్రపెన్యూరల్ రంగంలో కీలకమైన వ్యక్తుల ను, సంస్థల అధిపతులను, పాల సీ మేకర్లను, ప్రముఖ వ్యక్తులను ఆహ్వానిస్తుంది. కెటిఆర్‌కు ఉన్న అపారమైన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తు అంర టపెన్యూరల్ ఔత్సాహికులకు దిశా నిర్దేశం చేయాల్సిందిగా కెసిఆర్‌కు పంపిన ఆహ్వానంలో ఐఐటి మద్రాస్ కోరింది.
ఐఐటి మద్రాస్ విద్యార్థులు ప్రతిఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. దేశంలోనే అంతర్జాతీయ గుర్తింపు ఐఎస్‌ఓ సర్టిఫికేషన్ కలిగిన ఏకైక కార్యక్రమంలో నిలిచింది. శని, ఆదివారాలలో జరగనున్న ఈ కార్యక్రమానికి హాజరై ప్రసంగించాల్సిందిగా కెటిఆర్‌కు పంపిన ఆహ్వానంలో విజ్ఞప్తి చేశారు. ఈసారి ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రి పీయూష్ గోయల్, ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు ఒకరైన క్రిస్ గోపాలకృష్ణన్, హె చ్‌సిఎల్ సహ వ్యవస్థాపకులు అజయ్ చౌదరి వంటి ప్రముఖులు ఈ కార్యక్రమంలో ప్రసంగించనున్నట్లు ఐఐటి మద్రాస్ తెలిపింది.

# ముగిసిన ప్రాజెక్టుల పరిశీలన.

**మార్చి8 (జర్నలిస్ట్ వార్త):** :హైదరాబాద్ కాళేశ్వరం అనుబంధ మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల్లో నిర్మాణ వైఫల్యాలు, నిర్వహణ లోపాలు ఉన్నట్లు నేషనల్ డ్యాంసేఫ్టీ అథారిటీ నిపుణుల బృందం అంచనాకు వచ్చింది. ఈ మేరకు బ్యారేజీల డిజైన్లను క్షేత్ర స్థాయిలోకి తీసుకువెళ్లి కొలతలు తీశారు. డిజైన్ల మేరకు నిర్మాణాలు జరగలేదనే సందేహం వ్యక్తం చేసినట్లు పక్కా సమాచారం. అయితే భూసార పరీక్షలు, బ్యారేజీకి వాడిన మెటీరియల్‌ను తాము కోరిన విధంగా పరీక్షలు చేసి నివేదికలు ఇవ్వాలని నిపుణుల బృందం రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులను కోరింది.

%గత రెండు రోజులుగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన నేషనల్ డ్యాంసేఫ్టీ అథారిటీ ప్రతినిధి బృందం అనేక సందేహాలు, వైఫల్యాలను గమనించినట్లు తెలుస్తోంది. తొలుత మేడిగడ్డ బ్యారేజీని నిర్మించిన డిజైన్లు పరిశీలించి కొలతలు తీయగా డిజైన్ల మేరకు కొలతలు లేవనే అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అలాగే మహా రాష్ట్ర వైపున్న మేడిగడ్డ 7వ బ్లాక్, తెలంగాణ వైపున్న 1వ బ్లాక్ భూసారాల్లో వ్యత్యాసం, నీటి ప్రవాహ వేగాల్లో వైరుద్యాలు ఉన్నట్లు నిపుణుల బృదం పరిశీలనలో తెలిసింది.వరదల సమయంలోమిగతా బ్లాక్ ల్లో కంటే 7వ బ్లాక్ నుంచి లోతులో గోదావరి ప్రవహించిందనీ, సెకను వేగం 100లశాతం పెరిగిందని నిపుణులు గమనించినట్లు సమాచారం. ప్రవాహ వేగం, సామర్థ్యానికి మించి నీటి నిల్వ ఉండటం కూడా ఒక కారణంగా భావించినట్లు తెలుస్తోంది. భూసారంలో తేడాలున్నట్లు ఎలక్ట్రో రెసిస్టివిటీ టెస్ట్ (ఈ ఆర్ టీ) రిపోర్టు ద్వారా నిపుణుల బృందం గమనించింది. రాఫ్ట్ సీకెంట్ పైల్స్ మధ్య ఇసుక ఏమేరకు ఒత్తిడికి గురయిందనే అంశాన్ని నిపుణుల బృందం పరిశీలించింది. భూసారాల్లో వ్యత్యాసాలున్నప్పుడు నిర్మాణాల్లోతీసుకోవల్సిన జాగ్రతలు తీసుకోలేదనే అభిప్రాయంలో నిపుణుల బృందం ఉన్నట్లు తెలుస్తోంది.

శుక్రవారం సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ జె. చంద్రశేఖర్ సారథ్యంలో ఎన్డీఏ నిపుణుల బృందం సభ్యులు సెంట్రల్ సాయిల్ అండ్ రీసెర్చ్ స్టేషన్ శాస్త్రవేత్త యుసీ. విద్యార్థి, సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ శాస్త్రవేత్త ఆర్ఆర్ పాటిల్, కేంద్ర జలసంఘం డైరెక్టర్లు శివకుమార్ శర్మ, రాహుల్, ఎన్డీఎస్ఏ టెక్నికల్ డైరెక్టర్ అమితాబ్ శాస్త్రవేత్తల బృందం అన్నారం సుందిళ్ల బ్యారేజీతో పాటు సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాలను పరిశీలించింది. అన్నారం సీపేజ్ ఏర్పడిన 10 బ్లాక్‌తో పాటుగా 38,28 పియర్లను పరిశీలించింది. దెబ్బతిన్న ప్రాంతాల్లో విస్తృతంగా పరిశోధనలు చేశారు. బుంగలు ఏర్పడగానే తీసుకున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకుంది.పియర్ల దగ్గర గ్రౌంటింగ్ పనులను పరిశీలించింది. ఎల్ అండ్ టీ ప్రతినిధుల నుంచి ఈ బ్యారేజీలకు సంబంధించిన డిజైన్లను స్వాదీనం చేసుకుని నిర్మాణాల్లో ప్రతి ఇంచును పరిశీలించింది. స్ట్ర క్చరల్ ఇంజనీరింగ్ లో పియర్లకు బలం చేకూర్చే డయాఫ్రమ్ వాల్ పరిశీలించారు. అయితే గత వంద సంవత్సరాలుగా గోదావరి, ప్రాణహిత నదుల ప్రవాహవేగం, ప్రాజెక్టు నిర్మాణాలను అధ్యయనం చేసింది. నిపుణుల బృందం బ్యారేజీలను పరిశీలిస్తున్నప్పుడు రాష్ట్రానికి చెందిన అధికారులు, ఎల్ అండ్ టీ ప్రతినిధులను కూడా దగ్గరకు రానివ్వలేదు. అవసరమైన ఫోటోలను స్వయంగా ప్రతినిధి బృందం సభ్యులు తీసుకున్నారు.


Twitter/RahulGandhi

పోలీసుల సహాయంతో లాంగ్ విజువల్స్ ను డ్రోన్ల సహాయంతో తీసుకున్నారు. నిపుణుల బృందం పరిశీలిస్తున్నప్పుడు ఎవరినీ దగ్గరకు రానీయ కుండా సుమారు కిలో మీటరు పరిధిలోనే ఉంచారు. భారీ సాయుధపోలీసు బలగాల పహారాలో నిపుణుల బృందం శుక్రవారం సాయంత్రం 6.30 గంటల వరకు క్షేత్రస్థాయిలోనే ఉంది. పరిశీలన అనంతరం కావల్సిన నివేదికలను అందివ్వాలని నీటిపారుదల శాఖ అధికారులను నిపుణుల బృదం కోరింది. ప్రధానంగా మేడిగడ్డ బ్యారేజీ 7వ బ్లాక్ తొలగించి కొత్తది నిర్మించడమా? లేదా బ్యారేజీ మొత్తానికి మరమ్మతులు చేయాల్సి ఉందా అనే అంశానికి ఈ నిపుణుల బృందం సూచనలు చేయనుంది.

పూర్తి స్తాయి నివేదిక నాలుగు నెలల్లో ఇవ్వనున్నట్లు నిపుణుల బృందం ప్రకటించినప్పటికీ అంతకు ముందే మేడిగడ్డ బ్యారేజీ అంశం పై మధ్యంతర నివేదిక ఇవ్వనున్నట్లు సమాచారం. తొలివిడత పరిశీలనను పూర్తి చేసిన నిపుణుల బృందం హైదరాబాద్ కు చేరుకుని ఇక్కడి నుంచి ఢిల్లి%ు% వెళ్లనుంది. పరిశీలన అంశాలను ఎన్డీఏస్ తో సంప్రదించి అవసరమైతే మరోసారి క్షేత్ర పరీక్షకు నిపుణుల బృదం రానుందని అధికారులు తెలిపారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ నుంచి డ్యాంసేఫ్టీ అథారిటీ ఈఎన్సీ నాగేందర్ రావు, అధికారి సరళ ఈనిపుణుల బృందంతో ఉన్నారు.

# మోదీ చేతుల మీదుగా
# నేషనల్ క్రియేటర్స్ అవార్డు ప్రదానం

**మార్చి8 (జర్నలిస్ట్ వార్త):** న్యూఢిల్లీ : ఎన్నికల ఫలితాలనే ఈ సారి పునరావృతం చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. శుక్రవారం ఢిల్లీలోని భారత మండపంలో నేషనల్ క్రియేటర్స్ అవార్డులను ఆయన ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ%"% సృజనాత్మక వీడియోలు, కథనాలతో సమాజంలో మార్పు కోసం కృషి చేస్తున్న కంటెంట్ క్రియేటర్స్‌ను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డులను నూతనంగా ప్రవేశపెట్టింది. "స్టోరీ టెల్లింగ్, సామాజిక మార్పు, పర్యావరణ పరిరక్షణ, విద్య, గేమింగ్ వంటి వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన వారిని గుర్తించి, ప్రోత్సహించడమే ఈ అవార్డుల ముఖ్య ఉద్దేశం" అని తెలిపారు..%"మహిళా దినోత్సవం, శివరాత్రి రోజున ఈ అవార్డులను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉంది. విజేతలకు నా అభినందనలు. సృజనాత్మకతతో ఈ రోజు మీరంతా ఇక్కడిదాకా చేరుకున్నారు. భారత్ భవిష్యత్తు గురించి చర్చించేందుకే మనమంతా ఇక్కడ సమావేశమయ్యాం. పరిస్థితులకు అనుగుణంగా వచ్చే మార్పులను స్వీకరించడం మన బాధ్యత. తక్కువ ధరకు డేటా, మొబైల్ ఫోన్లు లభిస్తుండటంతో ఎంతో మంది కంటెంట్ క్రియేటర్లకు అవకాశం లభిస్తోంది. ఈ అవార్డులు దేశంలోని ప్రతి యువ కంటెంట్




క్రియేటర్ ప్రతిభకు నిదర్శనం. గత ఎన్నికల్లో మాదిరే ఈ సారి భాజపా క్లీన్‌స్వీప్ చేస్తుంది. అదే మా లక్ష్యం" అని ప్రధాన మోదీ అన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛ అంబాసిడర్ అవార్డు అందుకున్న మల్హార్ కలాంబేను ఉద్దేశించి 'సన్నగా కనిపిస్తున్నావ్.. బాగా తినాలి' అని సరదాగా వ్యాఖ్యానించారు.ఈ అవార్డుల కోసం 20 విభాగాల్లో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 1.5 లక్షల నామినేషన్స్ వచ్చాయి. వారికి మద్దతుగా పది లక్షల మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. అందులోంచి 23 మందిని విజేతలుగా ఎంపిక చేశారు. వీరిలో ముగ్గురు అంతర్జాతీయ క్రియేటర్స్ ఉన్నారు. మోస్ట్ క్రియేటివ్ క్రియేటర్ అవార్డును మహిళల విభాగంలో శ్రద్ధ, పురుషుల విభాగంలో ఆర్జే రౌనాక్ అందుకున్నారు.

# భక్తులతో శివాలయాలు కిటకిట

మక్తల్, **మార్చి8 (జర్నలిస్ట్ వార్త):**
మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివాలయాలన్ని భక్తులతో కిటకిటలాడాయి. నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో అతి పురాతనమైన శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంలో ఇవాళ తెల్లవారిజం నుండి శ్రీ మల్లికార్జున స్వామి వారికి అభిషేకాలు కొనసాగుతున్నాయి. పట్టణంతో పాటు పరిసర గ్రామాలనుండి వేలాది మంది భక్తులు తరలివచ్చి శ్రీ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. పెద్ద ఎత్తున అభిషేకాలు చేయిస్తున్నారు. భక్తుల పెద్ద ఎత్తున తరలిరావడంతో దర్శనం కోసం గంట నుండి రెండు గంటల సమయం పడుతుంది .శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయం తో పాటు మక్తల్ పట్టణంలోని శ్రీ అతి



పురాతనమైన ఉమామహేశ్వరాలయం , శ్రీ కుంభేశ్వరాలయం, శ్రీ నగరేశ్వరాలయం ,శ్రీ ఆత్మలింగేశ్వరాలయం అదే విధంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం లోని శివాలయంలోనూ అభిషేకాలు విశేష పూజలు కొనసాగాయి. భక్తులు మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉపవాస దీక్షలు చేపట్టారు. స్వామివారికి అభిషేకాలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు.ఆలయాల వద్ద పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చినప్పటికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు .ఎండల నుండి తట్టుకోవడానికి టెంట్లు , కూర్చునేందుకు కుర్చీలు వంటివి తో పాటు మంచినీటి వసతిని కల్పించారు. భక్తులు ఆ పరమశివుడిని ప్రశాంతంగా దర్శించుకున్నారు. అర్చకులు తిప్పయ్య స్వామి ,సిద్ధ రామయ్య స్వామి ఆధ్వర్యంలో విశేష పూజలు కొనసాగాయి.

## దేశంలోనే తొలిసారి..
## వితంతువులు మళ్లీ పెళ్లాడితే రూ. 2 లక్షలు..
## ప్రకటించిన జార్ఖండ్ ప్రభుత్వం



**మార్చి8 (జర్నలిస్ట్ వార్త):**
దేశంలోనే తొలిసారి జార్ ఖండ్ పభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. 'విధ్వా పునర్వివాహ ప్రోత్సాహన్ యోజన' పేరుతో వితంత పునర్వివాహ ప్రోత్సాహక పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం కింద భర్త మరణించిన తర్వాత మళ్లీ వివాహం చేసుకున్న మహిళలకు ప్రభుత్వం రూ. 2 లక్షల ప్రోత్సాహకం అందిస్తుంది. అయితే, లబ్ధిదారులు వివాహ వయసు కలిగి ఉండాలి. ప్రభుత్వ ఉద్యోగి, పెన్షనర్, ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు ఇది వర్తించదు. ఈ పథకం ప్రయోజనాలు పొందేందుకు లబ్దిదారు పునర్వివాహ తేదీ నుంచి ఏడాది లోపు దరఖాస్తు చేసుకోవాలి. దీంతోపాటు దివంగత భర్త మరణ ధ్రువీకరణ పత్రం జతచేయాల్సి ఉంటుంది. జీవిత భాగస్వామి మరణించిన తర్వాత మహిళలు సమాజంలో ఒంటరిగా, నిస్సహాయులుగా మిగిలిపోతున్నారని, వారు మళ్లీ కొత్త జీవితాన్ని ప్రారంభించవచ్చని అధికారి ఒకరు తెలిపారు. అలాంటి పెళ్లిళ్లకు ప్రభుత్వం ఆర్థికసాయం చేస్తుందన్నారు. వితంతువుల్లో ఈ పథకం ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందని, మహిళల పునర్వివాహం పట్ల సామాజిక అభిప్రాయాన్ని మారుస్తుందని పేర్కొన్నారు.

# అందుబాటు గృహాలకు
# స్థలాలు కేటాయించండి!
### ప్రభుత్వానికి క్రెడాయ్ విజ్ఞప్తి

**మార్చి8 (జర్నలిస్ట్ వార్త):**



హైదరాబాద్: సామాన్య, మధ్యతరగతి వర్గాల సొంతింటి కలను నిజం చేయాలంటే అందుబాటు గృహాలను నిర్మించాలి. చందన్‌వెల్లి, కొత్తూరు వంటి పలు ప్రాంతాలలో తయారీ రంగం అభివృద్ధి చెందింది.ఆయా ప్రాంతాలలో రూ.50 లక్షల లోపు ధర ఉండే అఫర్డబుల్ హౌసింగ్‌కు డిమాండ్ ఉంది. కానీ, స్థలాలు అందుబాటులో లేవు. ప్రభుత్వం చొరవ తీసుకొని రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులను కల్పించడంతో పాటు స్థలాలను అందించాలని" భారత స్థిరాస్తి డెవలపర్ల సమాఖ్య (క్రెడాయ్) హైదరాబాద్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.ఐటీ, ఫార్మా రంగాలతో అభివృద్ధి పశ్చిమ హైదరాబాద్‌కు మాత్రమే పరిమితమైంది. దీంతో ఆయా ప్రాంతాలలో లగ్జరీ ప్రా జెక్టులు ఎక్కువగా వస్తున్నాయి. ధరలు ఎక్కువగా ఉండటంతో సామాన్యుని సొంతింటి కల మరింత భారంగా మా రిందని, దీనికి పరిష్కారం అందుబాటు గృహాల నిర్మాణమేనని క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ వీ రాజశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. ఓఆర్ఆర్ చుట్టూ స్థలాలను గుర్తించాలని, ప్రభుత్వ, ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో ఈ ప్రాజెక్టులను నిర్మిస్తామని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఆయా గృహాలను విక్రయిస్తామని పేర్కొన్నారు.

## స్త్రీ శక్తికి మోడీ ఇచ్చిన ప్రోత్సాహకమే
## సుధామూర్తి నియామకం: లక్ష్మణ్




**మార్చి8 (జర్నలిస్ట్ వార్త):**
అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని మోడీ మహిళలకు బహుమతిగా ఉజ్వల గ్యాస్ కనెక్షన్లపై రూ.300 సబ్సిడీని మార్చి 2025 వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించడంపై రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ హర్షం వ్యక్తంచేశారు.అంతే కాకుండా ఉజ్వలేతర గ్యాస్ సిలిండర్లపై కూడా రూ.100 తగ్గిస్తూ నిర్ణయం తీసుకోవడం సంతోషకరమైన అంశంగా ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ప్రధాని మోడీకి లక్ష్మణ్.. ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి సతీమణి.. సుధామూర్తికి రాష్ట్రపతి కోటాలో రాజ్యసభకు నామినేట్ చేయడం మంచి నిర్ణయమని కొనియాడారు.మహిళలంతా గర్వించదగ్గ విషయంగా లక్ష్మణ్ పేర్కొన్నారు. సుధామూర్తి.. ఇన్ఫోసిస్ ఫౌండేషన్, గేట్స్ ఫౌండేషన్ ప్రజా ఆరోగ్య విభాగాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. సంఘ సేవకురాలుగా, కంప్యూటర్ ఇంజనీర్‌గా జీవితాన్ని ప్రారంభించి అనేక అనాథాశ్రయాలను స్థాపించి అభాగ్యులను ఆదుకుంటున్నారన్నారు. అలాగే గ్రామీణ అభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్న సుధామూర్తిని రాజ్యసభకు నామినేట్ చేయడం స్త్రీ శక్తికి మోడీ ఇచ్చిన ప్రోత్సాహమని లక్ష్మణ్ కొనియాడారు.

# ఆడబిడ్డల కోసం 'కలలకు రెక్కలు'

## కార్యక్రమం అమలు చేయబోతున్నాం: చంద్రబాబు
## ఆడబిడ్డలు ఇంటికే పరిమితం కాకూడదన్న ఉద్దేశంతో కొత్త పథకం తెచ్చామని వెల్లడి

**మార్చి8 (జర్నలిస్ట్ వార్త):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు శుభాకాంక్షలు తెలిపారు. మహిళలంటే సమాజంలో సగం జనాభా మాత్రమే కాదు, సమాజ శక్తిలో సగం అని పేర్కొన్నారు. అందుకే మహిళలను తోబుట్టువుల్లా చూసిన ఏకైక పార్టీ తెలుగుదేశం అని స్పష్టం చేశారు. వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టి, వారిలో ఆత్మవిశ్వాసం నింపి, ఆర్థిక స్వావలంబనకు నిరంతరం పని చేసింది తెలుగుదేశం అని వివరించారు. విద్య, ఉద్యోగాల్లో మహిళా రిజర్వేషన్లు వంటి విప్లవాత్మక నిర్ణయాలతో ఆడబిడ్డల జీవితాల్లో వెలుగులు



నింపింది తెలుగుదేశం అని పేర్కొన్నారు. "నేడు మళ్లీ మహిళలను మహాశక్తులుగా మార్చేందుకు హామీ ఇచ్చిందే మహాశక్తి పథకం. ఈ పథకం కింద ఇంట్లో చదువుకునే పిల్లలకు ఒక్కొక్కరికి ఏడాదికి రూ 15,000 చొప్పున ఆర్థిక సహాయం, ప్రతి మహిళకు నెలకు రూ.1,500ల ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు చొప్పున అందిస్తాం.అలాగే ఆర్థిక పరిస్థితులు అనుకూలించని కారణంగా మన ఆడబిడ్డలు ఇంటికే పరిమితం కాకూడదు అన్న ఆశయంతో, 'కలలకు రెక్కలు' అనే పథకాన్ని మన ప్రభుత్వం వచ్చాక అమలు చేయబోతున్నాం.




ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేసుకున్న ఆడబిడ్డలు పై చదువులు చదివేందుకు తీసుకునే రుణాలకు ప్రభుత్వమే పూచీకత్తుగా ఉంటుంది. అంతేకాకుండా కోర్సు కాలానికి ఋణంపై వడ్డీ కూడా ప్రభుత్వమే భరిస్తుంది. 'కలలకు రెక్కలు' పథకంలో మీ పేరును ఇప్పుడే నమోదు చేసుకోవచ్చు. అందుకోసం kalalakurekkalu.com వెబ్ సైట్ కు వెళ్లండి" అని పిలుపునిచ్చారు.

# త్వరలో కేంద్రానికి జమిలి ఎన్నికలపై నివేదిక

**మార్చి8 (జర్నలిస్ట్ వార్త):** ఒక దేశం, ఒకే ఎన్నికల ప్రతిపాదనను అధ్యయనం చేయడానికి నియమించిన మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించే ప్రక్రియలో ఉందని శుక్రవారం వర్గాలు వెల్లడించాయి. 2029 నుంచి అన్ని ఎన్నికలు ఒకేసారి నిర్వహించేందుకు వీలుగా రాష్ట్ర అసెంబ్లీల కాల పరిమితిని సమన్వయ పరిచే ప్రక్రియను సూచించడంతోపాటు లోక్‌సభ, అసెంబ్లీలు, మున్సిపాలిటీలు, పంచాయతీలతోసహా స్థానిక సంస్థలకు ఉమ్మడి ఓటర్ల జాబితా ఉండాలని కూడా తన నివేదికలో కమిటీ సూచించే అవకాశం ఉంది. జమిలి ఎన్నికల నిర్వహనపై అధ్యనం చేసి తన సిఫార్సులను సాధ్యమైనంత త్వరగా అందచేసేందుకు మాజీ రాష్ట్రపతి కోవింద్ సారథ్యంలో ఒక ఉన్నత స్థాయి కమిటీని 2023 సెప్టెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం నియమించింది. దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణ కోసం రాజ్యాంగంలోని ఐదు అధికరణలతోపాటు ప్రజా ప్రాతినిధ్య చట్ట నిబంధనలను కూడా సవరించాల్సిన అవసరం ఉంటుంది. పార్లమెంట్ సభల కాలం పరిమితిపై 83వ అధికరణ, రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు లోక్‌సభ రద్దుపై 85వ అధికరణ, రాష్ట్ర అసెంబ్లీల కాలపరిమితిపై 172వ అధికరణ, అసెంబ్లీల రద్దుపై 174వ అధికరణ, రాష్ట్రాలలో రాష్ట్రపతి పాలన విధింపుపై 356వ అధికరణను సవరించాల్సి ఉంటుంది. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, లోక్‌సభ, రాజ్యసభ, రాష్ట్ర అసెంబ్లీల ఎన్నికలను ఎన్నికల కమిషన్ నిర్వహిస్తుండగా



స్థానిక సంస్థల ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల కమిషన్లు నిర్వహిస్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల కమిషన్లు నిర్వహించినప్పటికీ లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలతో సమన్వయం చేసుకోవలసి ఉంటుందని బిజెపి వంటి పార్టీలు కోవింద్ సారథ్యంలోని కమిటీకి సూచించాయి. జమిలి ఎన్నికలు నిర్వహించిన పక్షంలో ప్రతి 15 సంవత్సాలకు ఒకసారి ఇవిఎంలు మార్చడానికి రూ.10,000 కోట్లు అవసరమవుతాయని ఎన్నికల కమిషన్ అంచనా వేసింది. ఇవిఎంల జీవితా కాలం 15 సంవత్సరాలు మాత్రమే ఉంటుందని, జమిలి ఎన్నికలు నిర్వహించిన పక్షంలో ఒక్కో సెట్ ఇవిఎంతో మూడు ఎన్నికలను మాత్రమే నిర్వహించవచ్చని గత ఏడాది కేంద్ర ప్రభుత్వానికి పంపిన లేఖలో ఎన్నికల కమిషన్ వివరించింది. కాగా..జమిలి ఎన్నికలపై న్యాయ సంఘం కూడా తన నివేదికకు తుది మెరుగులు దిద్దుతోంది. జమిలి ఎన్నికలపై రాజ్యాంగంలో ప్రత్యేక అధ్యాయాన్ని చేర్చాలని న్యాయ సంఘం సూచించనున్నది. 2029 మధ్య నాటికి మూడు విడతలలో రాష్ట్ర అసెంబ్లీల పదవీకాలాన్ని సమన్వయం చేసేందుకు ఒక రోడ్డుమ్యాప్‌ను న్యాయ సంఘం సూచించే అవకాశం ఉంది. జస్టిస్(రిటైర్డ్) రీతూ రాజ్ అవస్తి నేతృత్వంలోని న్యాయ సంఘం జమిలి ఎన్నికలపై ప్రత్యేక అధ్యాయాన్ని చేర్చడానికి రాజ్యాంగానికి సవరణను సిఫార్సు చేయనున్నది. కొత్త అధ్యాయంలో జమిలి ఎన్నికలు, జమిలి ఎన్నికల మనుగడ, ఉమ్మడి ఓటర్ల జాబితా వంటి అంశాలు ఆ అధ్యాయంలో ఉండే అవకాశం ఉంది. ఈ ఏడాది ఏప్రిల్ మే నెలలో లోక్‌సభ ఎన్నికలతోపాటు కనీసం నాలుగు రాష్ట్రాల అసెంబ్లీలకు కూడా ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. మహారాష్ట్ర, హర్యానా, జార?ండ్ రాష్ట్రాల అసెంబ్లీలకు ఈ ఏడాది చివరిలో ఎన్నికలు జరిగేఅవకాశం ఉంది. వచ్చే ఏడాది బీహార్, ఢిల్లీ అసెంబ్లీలకు ఎన్నికలుజరగవలసి ఉంది. అస్సాం, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ అసెంబ్లీలకు 2026లో ఉత్తర్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, మణిపూర్ అసెంబ్లీలకు 2027లో ఎన్నికలు జరగవలసి ఉంది. 2028లో త్రిపుర, మేఘాలయ, నాగాల్యాండ్, కర్నాటక, మిజోరం, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ అసెంబ్లీలకు ఎన్నికలు జరగవలసి ఉంటుంది.

# బీఆర్ఎస్ నేత సీతారామ్ నాయక్ ఇంటికి కిషన్ రెడ్డి... పార్టీలోకి ఆహ్వానం

**మార్చి8 (జర్నలిస్ట్ వార్త):** బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ సీతారామ్ నాయక్‌తో బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి శుక్రవారం భేటీ అయ్యారు. కిషన్ రెడ్డి శుక్రవారం హన్మకొండలోని బీఆర్ఎస్ నేత ఇంటికి వెళ్లారు. మహబూబాబాద్ లోక్ సభ స్థానం నుంచి బీఆర్ఎస్ పోటీ చేసే అవకాశం ఇవ్వకపోవడంతో సీతారామ్ నాయక్ అసంతృప్తితో ఉన్నారు. ఇదే సమయంలో ఆయనను కలిసిన కిషన్ రెడ్డి... బీజేపీలోకి ఆహ్వానించారు. భేటీ అనంతరం కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... తాను వర్సిటీ ప్రారంభోత్సవానికి వచ్చానని, అలాగే సీతారామ్ నాయక్‌ను కలిసేందుకు





వచ్చానని తెలిపారు. ఎందుకంటే గిరిజన వర్సిటీ కోసం గతంలో ఆయన ప్రయత్నం చేశారని గుర్తు చేశారు. మంచివారు ఎవరు బీజేపీలోకి వచ్చినా స్వాగతిస్తామన్నారు. సీతారామ్ వంటి వారిని తీసుకోవడానికి తమకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. బీజేపీలోకి వస్తారా? రారా? అన్నది ఆయన తేల్చుకోవాలన్నారు. బీఆర్ఎస్ మహబూబాబాద్ నుంచి మాలోత్ కవితకు మరోసారి అవకాశం ఇచ్చింది. ఈ సీటుపై ఆశలు పెట్టుకున్న సీతారామ్ నాయక్ తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

**జలగం వెంకట్రావుతో కిరణ్ కుమార్ రెడ్డి భేటీ**

ఖమ్మం జిల్లాకు చెందిన కీలక నేత జలగం వెంకట్రావుతో ఏపీ బీజేపీ నేత, మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి సమావేశమయ్యారు. ఆయనను బీజేపీలోకి ఆహ్వానించినట్లుగా తెలుస్తోంది. బీజేపీ నుంచి ఖమ్మం లోక్ సభ సీటును ఆఫర్ చేసినట్లుగా తెలుస్తోంది. ఇందుకు జలగం వెంకట్రావు కూడా సానుకూలంగా స్పందించినట్లుగా తెలుస్తోంది.

# పాకిస్థాన్ చరిత్రలోనే తొలిసారి.. మంత్రిగా సిక్కు నేత


**మార్చి8 (జర్నలిస్ట్ వార్త):** పాకిస్థాన్ చరిత్రలోనే ఒక అద్భుత ఘట్టం ఆవిష్కృతమయింది. సాధారణంగా ఆ దేశంలో హిందూ, సిక్కు, క్రిస్టియన్ తదితర మైనార్టీలు అత్యున్నత పదవులను అధిరోహించడం దాదాపు అసంభవం. అలాంటిది ఒక సిక్కు నేత పాకిస్థాన్ లో తొలి సిక్కు మంత్రిగా ఎన్నికయ్యారు. 49 ఏళ్ల సర్దార్ రమేశ్ సింగ్ అరోరా పంజాబ్ ప్రావిన్స్ లో మైనార్టీ వ్యవహారాల మంత్రిగా



బాధ్యతలను చేపట్టారు. పాకిస్థాన్ మైనార్టీ నాయకుల్లో రమేశ్ సింగ్ అరోరా శక్తిమంతమైన నేతగా ఉన్నారు. నవాజ్ షరీఫ్ కు చెందిన పాకిస్థాన్ ముస్లిం లీగ్ (నవాజ్) పార్టీ నేత అయిన రమేశ్ సింగ్ ఫిబ్రవరిలో జరిగిన ఎన్నికల్లో గెలిచి మూడోసారి పంజాజ్ ప్రావిన్స్ అసెంబ్లీలో అడుగుపెట్టారు. రమేశ్ కు పాక్ ఆర్మీతో మంచి సంబంధాలు ఉన్నట్టు తెలుస్తోంది. 2016లో పాకిస్థాన్ అధ్యక్షుడి చేతుల మీదుగా ఆయన మానవహక్కుల అవార్డును అందుకున్నారు. 1974 అక్టోబర్ 11న నరోవల్ జిల్లా నన్కానా సాహిబ్ లో జన్మించారు.

# ఈ నెల 12న కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాష్ట్ర పర్యటన

**మార్చి8 (జర్నలిస్ట్ వార్త):** / హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేసేందుకు కేంద్ర హోం శాఖమంత్రి అమిత్ షా ఈ నెల 12వ తేదీన తెలంగాణ పర్యటించనున్నారు. హైదరాబాద్‌లో ఉదయం 11 గంటలకు ఆపార్టీ నాయకులు 3 వేల మందితో నిర్వహించే సోషల్ మీడియా వారియర్స్ సమావేశానికి హాజరుకానున్నారు.లోక్ సభ ఎన్నికల్లో సోషల్ మీడియా వారియర్స్ ఏ



విధంగా పని చేయాలి, ఏయే అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి, ప్రజలను ఆకర్షించేలా పోస్టులపై దిశా నిర్దేశం చేయనున్నారు. అనంతరం మధ్యాహ్నం ఎల్బీ స్టేడియంలో నిర్వహించే బూత్ అధ్యక్షులు, ఆ పై స్థాయి నేతలతో భేటీ కానున్నారు. 25 వేల మంది బూత్ అధ్యక్షులు, ఆ పై స్థాయి నేతలు ఈ సమావేశానికి హాజరుకానున్నారు. గ్రామాల్లో ప్రతి బూత్‌లో 370 ఓట్లు వచ్చేలా కృషి చేయాలని బూత్ అధ్యక్షులకు మార్గనిర్దేశం చేయనున్నారు. సాయంత్రం 17 పార్లమెంట్ వర్కింగ్ గ్రూప్‌తో సమావేశమవుతారు. పార్లమెంట్ వర్కింగ్ గ్రూప్స్ సమావేశంలో 6 వేల మందితో సమావేశమై పార్లమెంట్ ఎన్నికల్లో ఏవిధంగా పని చేయాలి, పార్టీ విజయానికి కృషి చేయాల్సిన అంశాలను వివరిస్తారు.

# ఎన్నికల షెడ్యూల్ అంటూ సోషల్ మీడియాలో ఫేక్ మెసేజ్... అలర్ట్ చేసిన ఈసీ

**మార్చి8 (జర్నలిస్ట్ వార్త):** లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ ఇదీ అంటూ సోషల్ మీడియాలో ఓ ప్రకటన చక్కర్లు కొడుతోంది. ఈ ప్రకటనపై కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. తాము ఇప్పటి వరకు ఏ తేదీలనూ ప్రకటించలేదని, వాట్సాప్ సహా ఇతర సోషల్ మీడియా వేదికలపై షేర్ అవుతోన్న షెడ్యూల్ మెసేజ్ నకిలీది అని స్పష్టం చేసింది. ఇలాంటి ఫేక్ సందేశాలను ఇతరులకు పంపించే ముందు ధ్రువీకరించుకోవాలని సూచించింది.కాగా, మార్చి 12 నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని ఎన్నికల సంఘం పేరుతో ఓ షెడ్యూల్ షేర్ అవుతోంది. మార్చి 28 నుంచి నామినేషన్ల స్వీకరణ, ఏప్రిల్ 19న పోలింగ్, మే 22న ఓట్ల లెక్కింపు, మే 30న ప్రభుత్వ ఏర్పాటు అని ఆ ఫేక్ షెడ్యూల్‌లో ఉంది. అసెంబ్లీ లేదా లోక్ సభ ఎన్నికలను ప్రకటించే సమయంలో కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు మీడియా సమావేశం నిర్వహించి ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటిస్తారు.

# ప్రాజెక్టులపై బిఆర్ఎస్ నేతల అవాస్తవాలు

## బండి సంజయ్ ఓడిపోయినా సవాళ్లేనా..?
## మంత్రి పొన్నం ప్రభాకర్ ఎద్దేవా

**హుస్నాబాద్, మార్చి8 (జర్నలిస్ట్ వార్త): :** ప్రాజెక్టులపై వాస్తవాలు చెప్పేందుకు తాము ప్రయత్నిస్తుంటే బీఆర్ఎస్ నాయకులు మాత్రం డిజిటల్ హంగులు ఏర్పాటు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రచారం చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు.హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర, ముత్తారం గ్రామంలోని కైలాస కళ్యాణి క్షేత్రం, త్రికూటేశ్వరాలయాలను ఆయన సందర్శించారు. అక్కడ శివాలయంలో ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వం నిర్మించిన మేడిగడ్డ ప్రాజెక్టులో నేడు నీళ్లు లేకుండా పోయాయన్నారు.రాష్ట్రంలో ఒక యాత్ర నిర్వహిస్తున్న నాయకుడు మమ్మల్ని నాస్తికులుగా పోలుస్తున్నాడని, దేవుని పేరుతో



రాజకీయం చేసేది ఎవరో ప్రజలకు తెలుసన్నారు. ఎంపీగా ఉండి మూడుసార్లు ఎమ్మెల్యేగా ఓడిపోయావని, రాజకీయ సన్యాసం తీసుకోవాల్సింది ఆయనేనని పరోక్షంగా బండి సంజయ్‌ను విమర్శించారు. త్వరలోనే ఇందిరమ్మ ఇళ్ల ప్రోగ్రాం ప్రారంభిస్తామన్నారు. అనంతరం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లో రూ.2కోట్లతో ఆర్టీసీ బస్టాండ్ ఆధునీకరణ పనులకు మంత్రి శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఇప్పటివరకు 26 కోట్ల మంది మహిళలు బస్సుల్లో ప్రయాణించారని తెలిపారు. ఫ్రీ జర్నీ కోసం నెలకు రూ.350 కోట్లను ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. సీఎంతో చెప్పి కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఎలక్షన్ కోడ్ వచ్చేలోపే గతంలో ప్రకటించిన బాండ్స్ పేమెంట్స్ ఇష్యూ చేస్తామన్నారు.

# శతకాల పండుగ



**రోహిత్, గిల్ శతక గర్జన**
**%- పడిక్కల్, సర్ఫరాజ్ అర్ధ సెంచరీలు-**
**భారత్ తొలి ఇన్నింగ్స్ 473/8**
**- ప్రస్తుత ఆధిక్యం 255 పరుగులు**
**- ధర్మశాల టెస్టు రెండో రోజు**
**ధర్మశాల టెస్టులో తొలి రోజు స్పిన్నర్లు మాయ చేయగా..**

రెండో రోజు బ్యాటర్లు దండెత్తారు. నాయకుడు రోహిత్ శర్మ (103), యువ బ్యాటర్ శుభ్మన్ గిల్ (110) ధర్మశాలలో శతక మోత మోగించారు. రోహిత్, గిల్ శతక గర్జనతో భారత్ తొలి ఇన్నింగ్స్లో భారీ స్కోరు ఖాయం చేసుకుంది. తొలి ఇన్నింగ్స్లో 225 పరుగుల భారీ ఆధిక్యంలో దూసుకెళ్తున్న టీమ్ ఇండియా.. ధర్మశాల టెస్టుపై పట్టు బిగించింది. అరంగ్రేట బ్యాటర్ దేవదత్ పడిక్కల్ (65), సర్ఫరాజ్ ఖాన్ (56) అర్ధ సెంచరీలతో మెరిశారు. భారత టాప్-5 బ్యాటర్లు ఫిఫ్టీ ప్లస్ స్కోర్లతో కదం తొక్కారు. భారత్ తొలి ఇన్నింగ్స్లో 473/8 పరుగులతో కొనసాగుతున్నది. ఆధిక్యం ఇప్పటికే కొండంత ఉండటంతో ఆతిథ్య భారత్ మళ్లీ బ్యాట్ పట్టాల్సిన అవసరం రాకపోవచ్చు!.

హిమాలయ మంచు కొండల్లో భారత బ్యాటర్లు పరుగుల వరద పారించారు. భారత బ్యాటింగ్ లైనప్లో టాప్-5 బ్యాటర్లు 50కి పైగా పరుగులతో అదరగొట్టారు. కెప్టెన్ రోహిత్ శర్మ (103, 162 బంతుల్లో 13 ఫోర్లు, 3 సిక్సు), శుభ్మన్ గిల్ (110, 150 బంతుల్లో 12 ఫోర్లు, 5 సిక్సు) సెంచరీలతో చెలరేగారు. రెండో వికెట్కు 171 పరుగుల భారీ భాగస్వామ్యం నమోదు చేసిన రోహిత్, గిల్ భారత్కు భారీ స్కోరు ఖాయం చేశారు. అరంగ్రేట ఆటగాడు దేవదత్ పడిక్కల్ (65, 103 బంతుల్లో 10 ఫోర్లు, 1 సిక్స్), సర్ఫరాజ్ ఖాన్ (56, 60 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో మెరిశారు. లోయర్ ఆర్డర్లో కుల్దీప్ యాదవ్ (27 బ్యాటింగ్, 55 బంతుల్లో 2 ఫోర్లు), జస్ప్రీత్ బుమ్రా (19 బ్యాటింగ్, 55 బంతుల్లో 2 ఫోర్లు) ఆకట్టుకున్నారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 255 పరుగుల ఆధిక్యంలో నిలువగా.. కుల్దీప్, బుమ్రా క్రీజులో అజేయంగా నిలిచారు. ఇంగ్లాండ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ (4/170) నాలుగు వికెట్లు తీసుకున్నాడు. ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్లో 218 పరుగులకే కుప్పకూలిన సంగతి తెలిసిందే.

ఓవర్నైట్ స్కోరు 135/1తో రెండో రోజు బ్యాటింగ్కు భారత్.. ఉదయం సెషన్లో పరుగుల వరద పారించింది. అప్పటికే క్రీజులో నిలదొక్కుకున్న బ్యాటర్లు రోహిత్ శర్మ, శుభ్మన్ గిల్ ఇంగ్లాండ్ బౌలర్లను ఆడుకున్నారు. శుభ్మన్ గిల్ పరుగుల వేటలో దూకుడు ప్రదర్శించగా, రోహిత్ శర్మ చక్కటి సహకారం అందించాడు. ఈ ఇద్దరు బ్యాటర్ల జోరుతో తొలి సెషన్లో ఇంగ్లాండ్కు వికెట్ ఆనందమే దక్కలేదు. ఐదు ఫోర్లు, మూడు సిక్సర్లతో 64 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించిన శుభ్మన్ గిల్ ఆ తర్వాత మరింత జోరందుకున్నాడు. లంచ్ విరామానికి ముందు రోహిత్, గిల్ వరుసగా సెంచరీలు సాధించారు. 13 ఫోర్లు, 3 సిక్సర్లతో 154 బంతుల్లో రోహిత్ కెరీర్ 12వ టెస్టు సెంచరీ సాధించగా, శుభ్మన్ గిల్ 10 ఫోర్లు, 5 సిక్సర్లతో సిరీస్లో రెండో శతకం నమోదు చేశాడు. తొలి సెషన్ అనంతరం భారత్ 264/1 వద్ద నిలిచింది. రోహిత్ (102), శుభ్మన్ గిల్ (101) శతకాలతో అజేయంగా నిలిచారు. అప్పటికే భారత్ తొలి ఇన్నింగ్స్లో ఆధిక్యంలోకి వచ్చేసింది.


సమంత

సినిమాలకు విరామం ప్రకటించినప్పటికీ టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ అందరితో టచ్ లో ఉంటోంది. ఎప్పటికప్పుడు తన విశేషాలను, ఫొటోలను పంచుకుంటోంది. తాజాగా ఓ మేగజీన్ కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. తాను అభద్రతా భావానికి గురవుతున్నాననే విషయాన్ని గ్రహించగలిగానని... ఆ వెంటనే దాన్నుంచి బయటకు వచ్చానని సమంత తెలిపింది. బయటకు కనిపించే గాయాలకంటే మనసుకైన గాయం నుంచి కోలుకోవడానికే ఎక్కువ సమయం పడుతుందని చెప్పింది. మనపై మనకున్న విశ్వాసమే మనం గొప్ప వ్యక్తిగా ఎదగడానికి ఉపయోగపడుతుందని తెలిపింది.సినిమాల విషయానికి వస్తే... 'ఖుషి' సినిమా తర్వాత ఆమె మరో ప్రాజెక్ట్ చేయలేదు. ఆమె నటించిన వెబ్ సిరీస్ (ఇండియన్ వర్షన్) 'సిటాడెల్' విడుదలకు సిద్ధంగా ఉంది. ఇందులో హీరోగా బాలీవుడ్ నటుడు వరుణ్ ధావన్ నటించాడు. ఇటీవలే సమంత నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టింది. 'ట్రా లా లా మూవింగ్ పిక్చర్స్' పేరుతో ప్రొడక్షన్ హౌస్ ను ప్రారంభించింది.

## మనసుకైన గాయం నుంచి కోలుకోవడానికి ఎక్కువ సమయం పడుతుంది




## కన్నప్ప.. విల్లు ఎక్కుపెట్టిన మంచు విష్ణు!

టాలీవుడ్ హీరో మంచు విష్ణు లీడ్ రోల్ లో కన్నప్ప చిత్రం చేస్తున్న విషయం తెలిసిందే. పరమశివుని భక్తుడు కన్నప్ప జీవితం ఆధారంగా పాన్ ఇండియా లెవెల్ లో ఈ మూవీ తెరకెక్కుతోంది. ఇంతకు ముందు ఎన్నడూ చూడని విధంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు మేకర్స్. పీరియాడిక్ మైథలాజికల్ కాన్సెప్ట్ తో వస్తున్న ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. ఎక్కువ శాతం షూటింగ్ విదేశాల్లోనే జరుగుతోంది. న్యూజిలాండ్ లోని బ్యూటీఫుల్ లొకేషన్లలో కన్నప్ప సినిమాను షూట్ చేశారు మేకర్స్. అందుకోసం 600 మంది హాలీవుడ్ ప్రముఖులు పనిచేశారు. ప్రస్తుతం మంచు విష్ణు తో పాటు మోహన్ బాబు తదితరులు అక్కడే ఉన్నారు. ఇక రెండో షెడ్యూల్ కోసం అతి త్వరలో ఇండియా వస్తున్నట్లు ఇటీవల మంచు మోహన్ బాబు తెలిపారు. అయితే మంచు ఫ్యామిలీకి చెందిన మూడు జెనరేషన్లతో కన్నప్ప చిత్రం తెరకెక్కుతుండడం విశేషం. సినీ ప్రియుల్లో ఇప్పటికే భారీ అంచనాలు క్రియేట్ చేసిన ఈ ప్రాజెక్ట్ నుంచి తాజాగా క్రేజీ అప్డేట్ వచ్చింది. శివరాత్రి పండుగ కానుకగా మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్ ను శుక్రవారం రిలీజ్ చేశారు. "గొప్ప శివ భక్తుడు కన్నప్పగా నటించడం గౌరవంగా భావిస్తున్నా. ఈరోజు మహా శివరాత్రి.. ఇదిగో మీ కన్నప్ప.. హరహర మహదేవ్" అంటూ పోస్ట్ చేశారు మంచు విష్ణు. ఆరు భాషలకు సంబంధించిన పోస్టర్లను రివీల్ చేశారు. ఇప్పుడు సోషల్ మీడియాలో కన్నప్ప ఫస్ట్ లుక్ పోస్టర్ తెగ చక్కర్లు కొడుతోంది. ఇప్పటి వరకు కన్నప్ప అనగానే మనమంతా ఆటవికుడిగా, కోయ వ్యక్తిగా చూశాం. కానీ కన్నప్ప మేకర్స్.. ఇప్పుడు ఓ వారియర్ గా చూపించారు. శారీరక ధారుడ్యం, సూటిగా చూస్తూ విల్లును ఎక్కు పెట్టిన వీరుడిగా మంచు విష్ణు కనిపిస్తున్నారు. జలపాతాల్లో నుంచి గురి పెట్టిన వేటగాడిగా ఉన్నారు. ఫస్ట్ లుక్ పోస్టర్ సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేస్తోంది. సినీ లవర్స్ ను ఆకట్టుకుంటోంది. ఇక.. ఈ మూవీని భారీ బడ్జెట్ తోపాటు హై టెక్నాలజీ తో మోహన్ బాబు నిర్మిస్తున్నారు. హీరోయిన్ గా ప్రీతి ముఖుంధన్ నటిస్తున్నారు. ప్రభాస్- నయనతారలు శివపార్వతులుగా కనిపించనున్నారని టాక్ వినిపిస్తోంది. స్టార్ నటులు మోహన్ లాల్, శివరాజ్ కుమార్, శరత్ కుమార్, బ్రహ్మానందం కీలక పాత్రల్లో నటిస్తున్నారు. స్టీఫెన్ దేవస్సే, మణిశర్మ మ్యూజిక్ అందిస్తున్నారు. ఈ చిత్రంతోనే మంచు వారసుడు అవ్రామ్ చైల్డ్ ఆర్టిస్ట్ గా ఎంట్రీ ఇస్తున్నాడు. మరి ఈ మూవీ ఎలాంటి సంచలనం సృష్టిస్తుందో చూడాలి.

## ఓదెలా 2 స్టన్నింగ్ లుక్.. తమన్నా 'శివశక్తి'

రెండేళ్ల క్రితం ఓటీటీలో విడుదలై సంచలన విజయం సాధించిన క్రైమ్ థ్రిల్లర్ ఓదెల రైల్వే స్టేషన్ కు సీక్వెల్ తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. మిల్కీ బ్యూటీ తమన్నా.. ఇప్పుడు ఈ క్రైమ్ థ్రిల్లర్ సీక్వెల్ ఓదెల-2లో నటిస్తోంది. ఇటీవల వారణాసిలో ఈ సినిమా షూటింగ్ మొదలైంది. డిఫరెంట్ రోల్ పోషిస్తున్న తమన్నా లీక్డ్ పిక్స్ చూసి సినీ లవర్స్ అంతా ఒక్కసారిగా షాకయ్యారు. అశోక్ తేజ దర్శకత్వంలో సంపత్ నంది ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్ వర్క్స్ బ్యానర్లపై డి మధు నిర్మిస్తున్నారు. హీరోయిన్ హెబ్బా పటేల్ మరో లీడ్ రోల్ పోషిస్తోంది. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తమన్నా ఫస్ట్ లుక్ పోస్టర్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. ప్రస్తుతం మిల్కీ బ్యూటీ ఫస్ట్ లుక్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఓదెల-2లో పాత్ర కోసం తమన్నా తన మేక్ఓవర్ ను పూర్తిగా మార్చుకుంది. దిట్టమైన జుట్టుతో నాగ సాధువులా కనిపిస్తోంది. ఒక చేతిలో పవిత్ర కర్ర, మరో చేతిలో ఢమరుకం పట్టుకుని శివశక్తిలా దర్శనమిస్తోంది. కాశీ ఘాట్ లపై నడుస్తూ.. దేవుడిని ప్రార్థిస్తూ కనిపిస్తోంది. తమన్నా పోస్టర్ ను ఫ్యాన్స్ తెగ షేర్ చేస్తున్నారు. ఏ పాత్రలోనైనా తమన్నా జీవించేస్తుందని కామెంట్లు పెడుతున్నారు. మూవీ కోసం ఈగర్లీ వెయిటింగ్ అంటూ చెబుతున్నారు.ే సంస్కృతి, సంప్రదాయాలతో పాటు ఓదెల మల్లన్న స్వామి తన ఊరిని దుష్ట శక్తుల నుంచి ఎలా రక్షిస్తారనేది ఓదెల్-2 మూవీ మెయిన్ కాన్సెప్ట్ గా తెలుస్తోంది. ఓదెల రైల్వేస్టేషన్ లో లీడ్ రోల్ పోషించిన హెబ్బా పటేల్.. సీక్వెల్ లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా మారిపోయింది. వశిష్ట సింహా లీడ్ రోల్ పోషిస్తున్నారు. కాంతార ఫేమ్ అజనీష్ లోక్ నాథ్ ఈ సినిమాకు మ్యూజిక్ అందిస్తున్నారు. 2023లో లస్ట్ స్టోరీస్, జీ కర్దాలాంటి వెబ్ సిరీస్ లతోపాటు తమిళంలో జైలర్, తెలుగులో భోళా శంకర్ సినిమాల్లో తమన్నా నటించింది. ప్రస్తుతం ఆమె చేతిలో ఓదెల-2తోపాటు మరో రెండు సీక్వెల్స్ ఉన్నాయి. కోలీవుడ్ లో సుందర్ సి దర్శకత్వంలో అరణ్మణై 4, బాలీవుడ్ లో స్త్రీ 2 చేస్తోంది. మరి తమన్నా వరుస చిత్రాలు ఎలా అలరిస్తాయో చూడాలి.

